
ఆంగ్లంనుంచి తెనుగు
'మల్యాల'

# అపజయం

'శ్రీశ్రీ'



"అమ్మ మరణించబోతూంది. వెంటనే బయలు దేరు—రామం"

వెంకటేశ్వర్లు తన చిన్నతమ్ముడిచ్చిన టెలిగ్రాంలోని మాటలు మెల్లిగా తనలో తాను మళ్లీ అనుకున్నాడు. వర్తమానం చిన్నదే అయినా చాలా భయానకంగా రాబోయే ఆపదను సూచిస్తూ వుంది.

మనసులో భావాలు దొర్లుతో వున్నాయి. ఆమె బహుశాః చనిపోతుందేమో? నేను సాయంత్రం మెయిలు కెళ్లాలి. అలా వెళ్ళినా ఆమెను చూడగలనా ప్రాణాల్తో? రేపు బయల్దేరితే? అబ్బే! ఆవిడ చాలా ముసిలిదై పోయింది. నేను వెళ్ళేదాకా నిలద్రొక్కుకో గలదా? కాని నేను ఈ వేళ బయల్దేరలేను. అది మాత్రం నిజం. రేపు ఉదయాన్నే వెళ్ళాలి. ఆమె చనిపోదు. భయం లేదు. చావదు! నేను రేపు ప్రొద్దున్నే బయల్దేరుతున్నా. ఈ కాస్తలోనూ ఏవంత తేడా వుందని? మెయిలుకు బదులు ఎక్స్‌ప్రెస్‌లో వెడతాను. అయితే డబ్బు మాట?

అతని బుర్రలో పందెపుగుర్రాలు పరిగెడుతున్నాయ్!

డబ్బుసంగతి తలపెట్టగానే అతని మనస్సులో ఒక ఊహ తట్టింది. ఈ టెలిగ్రాం చేతబట్టుకుని దీనితోనే డబ్బు సంపాదిస్తా. అఁ! బలే! చాలా బాగుంది. తిరగవల్సిన చోట్లన్నీ తిరుగుతా! ఎంత వీలైతే అంత, ఎంతమందిదగ్గిర వీలైతే అంతమందిదగ్గర. నాలాంటి కష్టాల్లో వున్నవాళ్ళకి అప్పివ్వలేనంత రాతిగుండెలే వున్నారా లోకంలో అంతా? ఇద్దరో ముగ్గురో లేదంటే అనొచ్చు కాని ఇతరులు తప్పకుండా ఇస్తారు. తప్పకుండా ఓ వందరూపాయలైనా సంపాదిస్తా అందులో ఏమీ సందేహంలేదు.


అంతే, వెంటనే లేచాడు. బట్టలు మార్చుకున్నాడు. చిల్లరడబ్బులకోసం జేబులు తడిమి చూసేడు. ఒక్క చిల్లుదమ్మిడీ వుంటే ఒట్టు. అప్పుడు బాగా గుర్తుంది. జ్ఞాపకం తెచ్చుకోవసరంలేదు. అయినా ఓ మాటు జేబులన్నీ వెదకడం మానలేదు. లేనట్లు తనకి బాగా తెలుసునని మళ్లీ బోధపడింది. ఆఖరుకి చిల్లరకోసంగూడా ఎవర్నైనా ముష్టెత్తాలన్నమాట. దగ్గిరగా ఎవరున్నారు? అతను మాత్రం లేదంటేనా చచ్చేమన్న మాటే! ఎందుకూ, సత్యనారాయణున్నాడు కాదూ నాలుగు వీధులవతలా! అక్కడికి సులువుగా నడిచి వెళ్లచ్చు. ఎంతమంచివాడు? నా కొచ్చిన కష్టం వింటే కరిగిపోతాడు. తన పెళ్ళాం తాళిబొట్టు తాకట్టు పెట్టయినా ఇస్తాడు నేను అడగుతే! అంత మంచివాడు!

... ... ...

"సత్యనారాయణా!"

"ఆయన ఇప్పుడే వీధులో కెళ్లారండీ!"

ఏమి అపశకునం! ఇంత ప్రొద్దున్నే ఎక్కడికెళ్లాడు? ఏదీ టెలిగ్రాం: అయ్యో! గదిలో మరిచిపోయానేమో?



రైలు ప్లాటుఫారంమీద

వెంకటేశ్వర్లు

సత్యనారాయణ

వెంకటేశ్వర్లు జేబులు తడిమి చూసుకుని టెలిగ్రాం జేబులోనే వుందని గ్రహించాడు.

అయితే!! వీణ్ణిప్పు డెక్కడ పట్టుకోవడం. దగ్గిరేవున్న ఏ కాఫీహోటల్లోనైనా దొరకచ్చు. ఓ బేడ డబ్బులైనా లేవు కదా జేబులో. లోపలికి వాణ్ణి చూడ్డానికి వెళ్ళి ఓ కప్పు కాఫీయేనా తాగకపోతే ఎల్లా మరి! అబ్బే లేండి! వాడు కాఫీహోటలు కెళ్లుండడు! వాళ్ళింట్లో అడుగుతే ఎక్కడికి కెళ్లేడో? ఇంట్లో చెప్పి వెడతాడా ఎక్కడికి కెళుతోన్నదీ! అయినా చూద్దాం!

“ఆయన సెంట్రల్ స్టేషను కెళ్లేరండీ! రాగానే మీరు వొచ్చారని చెబుతాలెండి!”

వెంకటేశ్వర్లు ఆ వీధి చివర కిళ్లీకొట్టు నాయరు దగ్గిర నాలుగణాలు అప్పుచేసుకున్నాడు. వెంటనే ఓ బస్సు ఎక్కేడు. కూచోడానికి చోటుంటేగా మద్రాసుబస్సుల్లో. నించునే వున్నాడు అంత దూరమూ. మళ్లీ అతనిబుర్రలో రేసుగుర్రాలు గేలప్ మొదలెట్టాయి.

సత్యనారాయణని ప్లాటుఫారంపైన కల్సుకున్నాడు. రైలింకా రాలేదు. “నేను నా బావగారు వస్తారంటే రైలుకొచ్చాను” అన్నాడు సత్యనారాయణ.

అతనిదగ్గర నా విషయం ఎలా మొదలెట్టను? “నేను మీ యింటికెళ్లేను. అక్కడ నువ్వు కనిపించలేదు. నీతో అర్జంటుగా...” అలా మొదలెడితే—అబ్బే! బావుండదు. మాట్లాడకుండా జేబులో టెలిగ్రాం తీసి అతని చేతుల్లో జారవిడిచేడు.

“అరే! మీ అమ్మ కసలు జబ్బుగా వున్నట్టైనా తెలీదే?” “వార్ధక్యమోయ్! అదే ఆమె జబ్బు! అవిడెలాగా బతకదు. లాభం లేదు. ఈ వేళ సాయంత్రమే వెళ్లాలని అనుకుంటున్నా!”

సత్యనారాయణ తన చుట్టూ శూన్యంలోకి చూసేడు. అతని చూపులు నిశ్శబ్దాన్ని భేదిస్తోన్నాయి.

“నాదగ్గిర టిక్కెట్టుకేనా డబ్బులేదు.”

వెంకటేశ్వర్లు నోటంటవచ్చిన ఈ మాటలు ఎక్కడో పాతాళంనుంచి వచ్చినట్లు వినిపించాయి!

నందవాణి *

సత్యన్నారాయణ తల కుడిచేతి కరని, అంగుళాలతో నొక్కిపట్టి “నీకో పాతిక రూపాయలేనా కావాల్సుంటుంది అధమపక్షం!” అన్నాడు.

“ముప్ఫయ్యైనా కావాలి! నేను నీ దగ్గిరకి తప్ప ఇంకెవరిదగ్గిరకీ వెళ్ళదల్చుకోలేదు! ఎంత చనువున్నా ఇంకెవర్నీ నోరు తెరచి అడగలేనోయ్!”

నిజంగా సత్యన్నారాయణది జాలిగుండె! వెంకటేశ్వర్లుకి అతనిచేత భార్య నగ తాకట్టుపెట్టి ముప్ఫయి రూపాయిలూ ఇస్తాననిపించడానికి అయిదు నిమిషాలకంటె ఎక్కువ పట్టలేదు.

“సరే నేను రెండు గంటలకి మీ అఫీసుకి వస్తాను. డబ్బు తీసుకుందాం” అని స్టేషను విడిచి వెళ్లేడు.

... ... ...

వెంకటేశ్వర్లు స్నేహితుడైన ఓ చెట్టియారు దగ్గిర్నుంచి పది రూపాయలు రాబట్టేసరికి బ్రహ్మాండమైంది.

... ... ...

వెంటనే ఓ టాక్సీ కుదుర్చుకుని మైలాపూర్లోవున్న ఓ బేంకుకి వెళ్లేడు. బేంకు గుమాస్తా కామేశం వెంకటేశ్వర్లుకి పరిచయస్తుడుమాత్రమే! కాని అలాంటి పరిస్థితుల్లో డబ్బు కక్కడానికి స్నేహితుడికంటె పరిచయస్తుడైతేనే మంచిది.

బేంకులో అరగంటకాలం వృథా అయింది. వెంకటేశ్వర్లుకి ఓ దమ్మిడీకూడా దొరకలేదు. డబ్బుకోసం అనవసరంగా డబ్బు తగలెయ్యడం తెలివి తక్కువ అనుకుంటూ టాక్సీవాణ్ణి పంపించేశాడు.

దగ్గిరే కాపరమున్న ఇద్దరు వకీలు స్నేహితుల ఇళ్ళకెళ్ళేడు కాలినడకనే! ఈ టెలిగ్రాం చూపించి ఓ ప్లీడరుదగ్గర ఇరవై ఇంకో ప్లీడరు దగ్గర పాతిక రూపాయలూ ఒడుక్కోగలిగేడు!

పన్నెండయ్యేసరికి వెంకటేశ్వర్లుదగ్గర డెబ్బయ్యయిదు రూపాయలదాకా సమకూడాయి.

రేసుగుర్రాలు వాయువేగంతో పరుగెడుతోన్నాయ్ అతని బుర్రలో, సత్యనారాయణ ఇస్తానన్న ముప్ఫయ్యీ కలిసి నా దగ్గర నూట అయిదు రూపాయిలవుతాయ్! ఈ వేళ గిండీ పండుగన్న

... ఈ వేళ రేసుల ఆఖరు రోజు. ఎలాగ చూస్తూ వొదిలెయ్యడం! ఉదయాన్నే లేచి ఎక్స్‌ప్రెస్ కెడతాను!

"ఈసారి సులువుగా రెండు మూడు వందలు సంపాదించవచ్చు!" అనుకున్నాడు వెంకటేశ్వర్లు, క్రితం సాయంత్రం కొన్న రేసు గైడు జేబులోంచి పైకి తీస్తూ! రాత్రి తెల్లవార్లూ అతి తెలివి తేటల్తో శాస్త్రీకంగా చర్చించి గుర్తుపెట్టుకున్న గుర్రాల పేర్లన్నీ గొణుక్కున్నాడు నోట్లో. "నువ్వు తప్పకుండా గెలుస్తావీ వేళ" అని ఏదో అంతర్వాణి తోపిస్తోంది. లేదా అలా అనిపించిందతనికి.

అతను ఎలెక్ట్రిక్ ట్రెయిను సెకండ్ క్లాస్ కంపార్టుమెంటులో కులాసాగా కూర్చున్నాడు. 'ట్రెబిల్ ఈవెంటు' (తను తప్పకుండా గెలుస్తాను) కొట్టుకొచ్చేనంటే ఏడెనిమిది వొందలేనా రాక మానవు. ఈ వేళ చేసిన అప్పులన్నీ ఈ సాయంత్రమే తిర్చిపారేస్తా. క్రిందటిసారి రేసుల్లో ఓ దమ్మిడీయేనా మిగలకుండా నా జీతం అంతా ఓడిపోయాను! నీ స్వంత తెలివితేటల్ని కాదని ఇతరుల సలహావింటే ఏమవుతుంది?

'కాని ఈ వేళ అలా అవదు. నా డబ్బు గెల్చుకున్నట్టే. నా ఆలోచనల్లోనూ, లెక్కలలోనూ ఏమాత్రం తెలివితక్కువ లేదు. నా అంచనా శాస్త్రీకంగా రైటు అయి తీరుతుంది. ఈసారి ఓడిపోవడం అసంభవం!


... ... ...

ఆ సాయంకాలం వెంకటేశ్వర్లు పరిపరివిధాల ఆలోచిస్తూ ఎలెక్ట్రిక్ రైల్లో ఓ మూడో క్లాసు పెట్టెలో ఓమూల కూచున్నాడు. నికెల్ అణాలూ రాగి కాన్లూ కలిసి ఓ తొమ్మిదణాలచిల్లరా, రెండు సిగరెట్లతో వున్న విల్సు పేకెట్టూ ఓ సరికొత్త చిరుతపులి వేట అగ్గిపెట్టె ఆ వేళ ప్రొద్దున్న వొచ్చిన నలిగిపోయిన టెలిగ్రామూ—ఇవీ అతని జేబులో వున్న యావదాస్తి!

తనింత శాస్త్రీకంగా లెక్కలువేసీ కూడా ఓడిపోయేడంటే అర్థం ఏమిటీ? అతణ్ణి ఓదార్చే సమాధానం ఒక్కటే—రేసుకోర్సు నిబంధనల్ని పరిపాలించే శాస్త్రీకమైన సూత్రాలు ఆ రేసు గుర్రాలకే తెలియవన్నమాట!

—రిపబ్లిక్ నుంచి


దేవాలయ
పరిశుభ్రతకు



శుభ్రతకు దైవత్వమునకు దగ్గర సంబంధము కలదు. ఆధార నియమములతో శుద్ధంగా స్నానంచేయుటకు మనం పరిశుభ్రమైన సబ్బునే వాడవలెను. అన్ని టాయిలెట్టుసబ్బులవలెనే గోద్రెజ్ చాదనసబ్బులోగూడ స్వచ్ఛమైన, మేలయిన మూలికా తైలములు, ఎసెన్సులు వాడబడినవి. ఏవిధమగు జంతుక్రొవ్వును కలియలేదు. గోద్రెజ్ చందన సబ్బు స్వచ్ఛమైన మైసూరు చందన తైలంతో తయారుచేయబడినది. అది హాయినిగొల్పు, చల్లని సువాసనగల నురుగును పుట్టించును. ఈ మూలికా తైలముల నురుగు రోమకూపములను శుభ్రపర్చి, చర్మమును మృదువుగా జేయును. చల్లదనం చేకూర్చును. గోద్రెజ్ వెజిటబుల్ చందనసబ్బుకంటె స్నానములకు మంచిది వేరే కలదా యని మనలో ప్రశ్నించుకొని, నిష్పక్షపాతంగా సమాధానం చెప్పవచ్చును. ఎందుకనగా, శరీరమే దేవునియొక్క ఆలయం.

Godrej Sandal
chavi brand

గోద్రెజ్ శాండల్
చావి బ్రాండ్ (చందన)
టాయిలెట్ సబ్బులు

ఇతరచందన సబ్బులకంటె ఎక్కువగను. మేలుగను యుండి తక్కువ ధరకు దొరకు సబ్బు.

గోద్రెజ్ సోప్స్, లిమిటెడ్.
మద్రాసు: 164, బ్రాడ్వే.
కొచ్చిన్: 6/86, కల్వతి.